క్లుప్తంగా

వరసిద్ధునికి ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న భక్తులు

వెదురుకుప్పం: మండలంలోని సీఆర్ కండ్రిగలో నూతనంగా నిర్మించిన వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో శనివారం భక్తి ప్రపత్తులతో అభిషేక పూజలు నిర్వహించారు. పట్టు పీతాంబరాలతో స్వామి వారిని సర్వాంగ సుందరంగా ముస్తాబుచేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అలాగే ఆలయ ఆవరణలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, నాగదేవత, వీరాంజనేయునికి ప్రత్యేక పూజలు చేశారు.

అవార్డు గ్రహీతలకు అభినందన



శ్రీనివాసంతి, శ్రీధర్

గంగాధర నెల్లూరు: ఉత్తమ సేవలందించి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో అవార్డు అందుకున్న సీఐ శ్రీనివాసంతి, హౌసింగ్ ఏఈ శ్రీధర్‌ను శనివారం ఆయా శాఖల సిబ్బంది అభినందించారు.

చందనం అలంకరణలో కాలభైరవుడు


చందన అలంకారంలో కాలభైరవుడు

నగరి: ఆడి అష్టమిని పురస్కరించుకొని పట్టణ పరిధిలోని కామాక్షి సమేత కరకంఠేశ్వర ఆలయంలోని కాలభైరవస్వామి సన్నిధిలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి పాలు, పెరుగు, చందనం, పంచామృతం, పన్నీరు, విభూదితో ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. అభిషేకానంతరము స్వామివారికి చందనాభిషేకం చేసి చందనంతో అలంకరణ చేశారు. భక్తులు మొక్కుబడిగా ఇచ్చిన వడమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. పూజలు ప్రత్యేకం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహాసభల పోస్టర్లు విడుదల


పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. శనివారం వారు నగరంలోని గాంధీ విగ్రహం వద్ద మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఈనెల 20 నుంచి 25వ తేదీ వరకు ఒంగోలులో జరగనున్న రాష్ట్ర 28వ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నాగరాజు, జిల్లా సహాయ కార్యదర్శులు జనార్దన్, శివారెడ్డి నాయకులు పాల్గొన్నారు.

మురుగన్‌కు హరోం హర

- భక్తిప్రపత్తులతో ఆడికృత్తిక
- వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరుని బ్రహ్మోత్సవాలు
- పెద్దసంఖ్యలో కావళ్లు సమర్పించిన భక్తులు



కొత్తపేటలో ప్రత్యేక అలంకారంలో సుబ్రహ్మణ్యస్వామి, ప్రత్యేక అలంకరణతో స్వామి, అమ్మవార్లు

కార్వేటినగరం: కుమారగిరిపై వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శనివారం ఈ సందర్భంగా ఆడికృత్తిక మహోత్సవాలను భక్తులు అత్యంత భక్తిప్రపత్తులతో జరుపుకున్నారు. పెద్దసంఖ్యలో కావళ్లతో వచ్చి స్వామివారికి సమర్పించారు. పవిత్ర స్కంధ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. దాతలు ముత్తు మునస్వామిరెడ్డి, దేవారెడ్డి నేతృత్వంలో సుమారు 5వేల మందికి అన్నదానం చేశారు. దాత మునిప్రసాద్ ఆధ్వర్యంలో 30వేల లడ్డూలను భక్తులకు పంపిణీ చేశారు. కార్వేటినగరం యువత మజ్జిగ, తాగునీరు అందించారు. ఏర్పాట్లను ఈఓ కృష్ణనాయక్ పర్యవేక్షించారు.

ఘనంగా సారె సమర్పణ

స్వామి, అమ్మవార్లకు పద్మసరస్సు ఎస్టీ కాలనీవాసులు ఘనంగా సారె సమర్పించారు. సారెను ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయ అధికారులకు అందజేశారు.

తెప్పపై విహారం

ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్కంధ పుష్కరిణిలో కనులపండువగా తెప్పోత్సవం నిర్వహించారు. శ్రీవల్లీ, దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారు సుగంధ భరిత పుష్పమాలికలు, విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించిన తెప్పపై ఆశీనులై విహరించారు. నగరి డీఎస్పీ సయ్యద్ అహ్మద్ అజీజ్, సీఐ హనుమంతప్ప బందోబస్తు చేపట్టారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: మండలంలోని పలు గ్రామాల్లో భక్తులు కావళ్లు ఎత్తుకుని షణ్ముఖుని దర్శనానికి తరలివచ్చారు. పెద్దసంఖ్యలో భక్తులు తమిళనాడులోని తిరుత్తణికి కావళ్లతో బయలుదేరి వెళ్లారు.

కిక్కిరిసిన ఆలయాలు

గంగాధర నెల్లూరు: మండలంలోని సుబ్రహ్మణ్య స్వామి ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. కోటగారం పంచాయతీలోని ఎట్టేరిలో కొండపై వెలసిన శ్రీ సుబ్రహ్మణ్యస్వామి ఆలయం, సిద్ధేశ్వర కొండలోని దేవాలయంలో శని విశేష పూజలు నిర్వహించారు.

నేడు కల్యాణోత్సవం

ఎట్టేరి కొండపై వెలసిన సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఆదివారం కల్యాణోత్సవం జరిపించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రారంభమయ్యే కల్యాణోత్సవానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలిరావాలని కోరారు.

నగరి: పట్టణంలో శనివారం ఆడికృత్తిక వేడుకలు ఘనంగా జరిగాయి. హరోంహర నామస్మరణతో పట్టణం మారుమోగింది. సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ఏకాంబరకుప్పం సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో భక్తులు కావళ్లతో క్యూకట్టారు. కొత్తపేట అగర వినాయక శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఉదయం అభిషేకం నిర్వహించారు. స్వామి వారిని పట్టణ వీధుల్లో ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు కావళ్లతో ఆలయాలకు వెళ్లి తమ మొక్కులు చెల్లించారు. స్థానిక కరకంఠేశ్వర స్వామి ఆలయంలోని సుబ్రహ్మణ్యస్వామి సన్నిధిలో ప్రత్యేక అభిషేక, అర్చనలు చేసి స్వామిని సర్వ సుందరంగా అలంకరించారు.

నింద్రలో..

నింద్ర: మండలంలో ఆడికృత్తిక పురస్కరించుకుని భక్తులు కృత్తిక కావళ్లు ఎత్తుకుని తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామికి మొక్కులు చెల్లించారు. రామగిరిలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో భక్తులు కిటకిటలాడారు.

విజయపురంలో..

విజయపురం: మండలంలో ఆడికృత్తిక వేడుకలు ఘనంగా జరిగాయి. శనివారం విజయపురంలో సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం కావళ్లు చెల్లించడానికి తిరుత్తణికి వెళ్లారు.




జీడీ నెల్లూరు: విశేషాలంకరణలో స్వామి,అమ్మవార్లు, నింద్ర: కావళ్లతో వెళుతున్న భక్తులు, శ్రీకావేరిరాజుపురంలో..


నగరిలో కావళ్లతో వెళుతున్న భక్తులు


సారెను తీసుకొస్తున్న ఎస్టీ కాలనీ వాసులు


పాలసముద్రంలో..


కావళ్లతో తరలివచ్చిన భక్తులు

వైభవం.. గోకులాష్టమి


శ్రీకృష్ణ పూజల్లో యాదవ సంఘ సభ్యులు

నగరి: గోకులాష్టమి పూజలను పట్టణంలో శనివారం వైభవంగా నిర్వహించారు. శ్రీకృష్ణ, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిని సుందరంగా అలంకరించారు. ఆలయాల్లో శ్రీకృష్ణ భజనలు మారుమోగాయి. మండలంలోని యాదవ సంఘం వారు ఈ ఏడాది గోకులాష్టమిని పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఏకాంబరకుప్పం సుబ్రహ్మణ్య స్వామి దేవాలయం నుంచి నగరి ఓంశక్తి ఆలయం వరకు శ్రీకృష్ణుని చిత్రపటంతో హరేరామ హరే కృష్ణ భజనలు చేస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్‌వీజీ మహల్‌లో అందరూ కలిసి శ్రీకృష్ణాష్టమి పూజలు నిర్వహించారు. యాదవ సంఘ నేతలు రామలింగం, నరేష్, వెంకటేశ్, వరదరాజ్, వెంకటరత్నం పర్యవేక్షించారు.


శ్రీకృష్ణుని చిత్రపటంతో ర్యాలీ నిర్వహిస్తున్న యాదవ సంఘ సభ్యులు

స్త్రీ శక్తి అంతా ఆర్భాటమే!


గాయత్రీదేవి

చిత్తూరు కార్పొరేషన్: ఉచిత బస్సు పథకం ఆర్భాటమేనని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగ ప్రధాన కార్యదర్శి గాయత్రీదేవి విమర్శించారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ అధికారంలో వచ్చి ఏడాదిన్నర కావొస్తున్న నేపథ్యంలో స్త్రీశక్తి పథకం అమలు చేస్తున్నారని.. అందులోనూ కొర్రీలు పెట్టడమేమిటని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలు బస్సుల్లో ఎక్కడికైనా వెళ్లవచ్చని చెప్పారన్నారు. ఇప్పుడు కొన్ని కేటగిరి బస్సుల్లో మాత్రమే ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించారన్నారు. పథకం ప్రారంభమైన శుక్రవారం రాత్రి నుంచే పలు బస్సుల్లో ఉచిత ప్రయాణం లేదని బోర్డు పెట్టడం ఏంటని ఎద్దేవా చేశారు.

గౌతు లచ్చన్న విగ్రహం ఏర్పాటు చేయాలి

చిత్తూరు కలెక్టరేట్: చిత్తూరు నగరంలో స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహం ఏర్పాటు చేయాలని చిత్తూరు జిల్లా ఈడిగ గౌడ్ సంఘం అధ్యక్షుడు కృష్ణమూర్తి గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సర్దార్ గౌడు లచ్చన్న సేవలు మరువలేనివని.. అందుకు గుర్తుగా చిత్తూరు నగరంలో గంగినేని, కట్టమంచి చెరువుల వద్ద ఏదైనా ఒక చోట విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు.

తిరుచ్చిపై వెంకన్న విహారం


ఊరేగుతున్న దేవదేవేరులు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారు శనివారం బంగారు తిరుచ్చి వాహనంపై విహరించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా వేకువజాము స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు సమర్పించారు. కనులపండువగా కల్యాణోత్సవం జరిపించారు. సాయంత్రం వేడుకగా ఊంజల్ సేవ చేపట్టారు. అనంతరం దేవదేవేరులను తిరుచ్చిపై కొలువుదీర్చి ఊరేగించారు.

‘ట్రాన్స్‌జెండర్ ట్రూ స్టోరీ’ ఆవిష్కరణ


పుస్తకావిష్కరణలో ట్రాన్స్‌జెండర్లు

తిరుపతి అన్నమయ్యసర్కిల్: కత్తిమండ ప్రతాప్ రచించిన ట్రాన్స్‌జెండర్ ట్రూ స్టోరీ (అతడు–ఆమె) పుస్తకాన్ని ట్రాన్స్‌జెండర్ల చేతులమీదుగానే శనివారం ఆవిష్కరించారు. ట్రాన్స్‌జెండర్ల ఆవేదనను కళ్ల కట్టేలా రచయిత ఆవిష్కరించారని కొనియాడారు. మా భావోద్వేగాలను అర్థం చేసుకుని కంట తడి పెట్టేలా రచించిన ప్రతాప్‌కు అభినందనలు తెలిపారు. హాసిని మాలిక్, చల్లగొల్ల హేమా నవీన్, నందిని, సుప్రియ, కరిష్మా, జెస్సికా, చందు, లిఖిత పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం


గుర్తింపు దినోత్సవంలో నేతలు

చిత్తూరు కలెక్టరేట్: వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారమే తమ సంఘం ప్రథమ ప్రాధాన్యత అని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివయ్య అన్నారు. ఈ మేరకు ఆ సంఘం గుర్తింపు దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఆ సంఘ కార్యాలయంలో జెండాను ఎగురవేసి కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీ నాటికి తమ సంఘానికి గుర్తింపు వచ్చి ఆరేళ్లు పూర్తయిందన్నారు. ఈ ఆరేళ్ల కాలంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు చేశామన్నారు. నాలుగో తరగతి ఉద్యోగి నుంచి గ్రూప్ వన్ కేడర్ అధికారి వరకు ఎటువంటి సమస్యలు వచ్చినా పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అనంతరం చిత్తూరు తాలూకా ఆధ్వర్యంలో రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కిషోర్, సురేంద్రనాథ్‌రెడ్డి, బాలు, విజయ్, కృష్ణమూర్తి, దిలీప్ పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో ఉన్నత విలువలు


స్కౌట్ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న రమేష్‌బాబు

శ్రీకాళహస్తి: స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరడం వల్ల విద్యార్థులకు ఉన్నత విలువలు పెంపొందుతాయని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యాలయ కమిషనర్ రమేష్ బాబు తెలిపారు. పట్టణంలోని బాబు అగ్రహారం పురపాలక ఉన్నత పాఠశాల ఆవరణంలో ఇటీవల తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంపులో ఉత్తీర్ణులైన స్కౌట్స్ విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చిన్నతనం నుంచే క్రమశిక్షణ, సేవా నిరతి, దేశభక్తి వంటి ఉత్తమ లక్షణాలు అలవరిచేందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎంతగానో దోహదం చేస్తుందని అన్నారు. తృతీయ సోపాన్, రాజ్యపురస్కార్ వంటి సర్టిఫికెట్స్ పొందిన వారికి ఉన్నత విద్య ప్రవేశాలకు 0.05 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. స్కౌట్ మాస్టర్ షేక్ అజారుద్దీన్‌ను అభినందించారు.

జయ జనార్దనా కృష్ణా

- వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు


పాలసముద్రం: ఊరేగుతున్న దేవదేవేరులు


దేవదేవేరులకు స్నపన తిరుమంజనం



వెదురుకుప్పం: చవటగుంటలో ప్రత్యేక అలంకరణలో స్వామి వారు, అలంకరణలో స్వామివారు

కార్వేటినగరం: శ్రీవేణు గోపాలస్వామి ఆలయంలో శనివారం వేడుకగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జామునే స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు సమర్పించారు. మూలవిరాట్‌ను పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం 10 నుంచి 11 గంటల వరకు రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణు గోపాలస్వామి ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 5.30 నుంచి 6.30వరకు టీటీడీ వేద పండితులు ఆస్థానం, పురాణ పఠనం చేపట్టారు. ఈ క్రమంలోనే రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలుడు తిరుచ్చిపై కొలువుదీరి మాడవీధుల్లో విహరించారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

అలరించిన నృత్య నివేదన

ఆనవాయితీ ప్రకారం బొబ్బిలి వంశస్తులైన బొబ్బిలి రంగారావు దత్తపుత్రుడు బొబ్బిలి ప్రసాద్ ప్రదర్శించిన నృత్యం ఆకట్టుకుంది. కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ పార్థసారథి, సోమశేఖర్, ఆలయ అధికారి సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం, మాంబేడు, చవటగుంట, బందార్లపల్లెలోని ఆలయాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు.

శ్రీరంగంగరాజపురం: మండలంలో ఆరిమాకులపల్లెలోని శ్రీకృష్ణ ఆలయంలో సర్పంచ్ దామునాయుడు ఆధ్వర్యంలో అష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

పాలసముద్రం: మండలంలోని కొల్లకండ్రిగ, బలిజూరులో శ్రీకృష్ణాష్టమి శనివారం శ్రీకృష్ణునికి పట్టాభిషేకం నిర్వహించారు. అనంతరం చిత్రపటాలను ఊరేగించారు.

నింద్ర: మండలంలో శ్రీకృష్ణ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేఆర్ పాళెం, శ్రీరామపురం, కావునూరు, ఇరుగువాయి గ్రామాల్లోని ఆలయంలో శ్రీకృష్ణ దేవాలయాల్లో అభిషేకాలు, అర్చనలు చేశారు. సాయంత్రం స్వామివారిని పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.


బొబ్బిలి వంశస్తుడి నృత్య ప్రదర్శన


ఉట్లోత్సవంలో యువత


వెదురుకుప్పం: బందార్లపల్లెలో పూజా సామగ్రి తీసుకెళుతున్న భక్తులు